పాపరాధ పరిశోధన

# పారిపోయిన శవం!

(డిటెక్టివ్ కేయాస్ ఆనంద్ రెండవ కేసు')

టి. వి. శంకరమ్

బ్రాహ్మడు చదివిన మాయ మంత్రాలు-నల్లపాటివాడు ఎందుకు లెంప కాయ కొట్టాడు?-చెట్టు కింద ముసుగు మనిషి!-పావలా లంచం-మిస్టిరీ!-మిస్టిరీ!-అంతా ఏక మిస్టిరీ!

"ఏం, గురో!"

"ఏంటి, భద్రం?"

"సాక్షివాళ్ళో ఏం తోచటం లేదు, గురో!"

"ఊరేం చేసింది భద్రం? ఇక్కడ మనకి బొత్తిగా కేసుల్లేకుండా పోయి నందువల్ల తోచటం లేదు. అంతేనా?"

"మనం పట్నం వెళ్ళిపోదాం, గురోజీ."

"పట్నంలో మాత్రమేం వుంది, భద్రం? ఒకటే కార్లూ, బస్సులూ! పైన మన శత్రువులంతా అక్కడే ఉన్నారు! ఎవరు మనమీదిగా కారు తోలినా మనం ఫైసలా!" అన్నాను తగని విచారంగా.

భద్రం కాస్సేపు బీడీ దమ్ముపట్టి, "అవునుగాని, గురో? ఇక్కడ కూచుంటే మనమేం కేసులు పట్టేట్టూ? ఆ పట్నంలో అంటే ఆ దారివేరు!"

భద్రంకేసి ఎర్రగా చూసి, "భద్రం, నీకెంకా ఆ ఎగస్ట్రా వేషాలమీద బుద్ధి పోతూనే ఉంది! నిజం చెప్పు!" అన్నాను.

భద్రం యికిలిస్తూ, "ఇప్పుడదేమంత లేదులే, గురో! నేనైనా కేసులమాటే ఆలోచిస్తున్నా. పట్నంలో మనం కారాడి గాలించామంటే వీధి కొక శవం దొరుకుతుంది! ఓసారేమయిందంటే—"

నేను చిటికేసి లేచి నిలబడి, "తెలిసింది, భద్రం!" అన్నాను.

"ఏంటి, గురో?" అన్నాడు భద్రం.

"నిజంగా ఆసిస్టెంటంటే నీమాదిరిగా ఉండాలి!"

"ఎందుగ్గురో?"

"అవిడియా ఇచ్చేశావంతే!"



"ఏమిటా అవిడియా, గురో?"

"మనకెందుకు తోచటంలేదు?"

"కేసుల్లాక!"

"కేసులెందుకు లేవూ?"

"మన ప్రారబ్ధం గురో!"

"కాదు!... వట్టిబుర్ర!... శవాల్లేక!"

"అన్నమాటేగా, గురో?"

"కనక మనం ఏం చెయ్యాలి?"

"ఎవరినన్నా చంపి తేసరి!"

ఇది నాకు తట్టలేదు. కాని ఆలోచిస్తే ఇది అంత బాగాలేదు. చంపినవాడు డిటెక్షన్ చెయ్యటం కొంచెం కష్టం. పైన ఇంకో డిటెక్టివుకు చాన్సు! లాభంలేదు.

"చూడు, భద్రం?"

"ఏంటి, గురోజీ?"

"నువ్వు వెంటనే బయలుదేరి ఊళ్ళో ఎక్కడెక్కడ శవాలున్నదీ భోగట్టా చేసుకురా."

"ఎక్కడా లేకపోతే అట్టా స్మశానం కెళ్ళి వెళ్ళొద్దునా?"

"ఓ! భేషుగా భద్రం! మహారాజుగా!"

భద్రం వెళ్ళిన తర్వాత కుర్చీమీద గొంతుకూచుని దీర్ఘంగా ఆలోచించాను. డిటెక్టివులకు కేసంటే హుషారుగా ఉండటంలో ఆశ్చర్యంలేదు. కాని కదిలీకు పోలీసినస్పెక్టర్లకేం రోగం? వాళ్ళకు రోజులూ కేసులు వస్తూ-టయ్యి గదా, వాళ్ళకు అయోమయంగా ఉన్న వాటిల్లో నా సలహా తీసుకుంటే యేం? ఒకవాళ మా యింటికి టెలిఫోను చేసి ఇనస్పెక్టరు కరవాత కారులో వస్తాడు. మెట్లెక్కి రావటానికి మా యింటికి మేడ లేదు కూడా!

అసలు ఇనస్పెక్టరుకు కారుందో లేదో! మరి ఇన్ని లోపాలూ ఉండగా కేసుల్లేవంటే ఎట్లా? నిజం బడితే, డిటెక్టివు కుండాల్సిన ఏ హంగులూ నాకు లేకపోయె! భద్రం అన్నట్టు పట్నంలోతే ఉంది మజాఖా. ఇప్పుడు మా నాన్న కూడా లేడు గనక మా అమ్మకు తెలీకుండా డబ్బు తీసుకు పోతేసరి ... ఈసారి హోటలు గీటలు లేదు. సరాసరి ఇల్లూ, టెలిఫోనూ, మేడమెట్లూ అద్దెకు తీసుకోవటమే. కారుకూడా కొనొచ్చుట— భద్రం చెప్పాడు. రెండువేలు పెడితే సెకెండు హాండు కారొస్తుందిట. అందులో మనం ఒక్క వెయ్యి ముందిస్తే, మార్వాడీ మిగిలిన వెయ్యీ తనిచ్చి, కారు మోరటుగేజీ పెట్టుకుని, నెలకు వంద చొప్పున ఏడేళ్ళమీద తన సొమ్ము తీసేసుకుంటాట్ట! హాశ్చర్యం, మార్వాడీల్లోకూడా మంచి వాళ్లుంటారు!

"గురో!"

నేను ఉలిక్కిపడి, "ఏంటి భద్రం?" అన్నాను.

"శవం!"

"ఎక్కడా?"

"పక్కవీధిలోనే! పడేసి కట్టేస్తున్నారు!"

"వాళ్ళ పేర్లు రాసుకున్నావా?"

"నేనా? హమ్మ బాబోయ్! 'నువు డిటెక్టివా?' అని వాళ్ళడిగితే నేనేం చెప్పేది? మీరే రండి! అరిజంటుగా, నుంచున్నపాట్న వచ్చెయ్యాలి మరి."

"భూతద్దం? బాటరీలైటు? టేపు!"

"అవన్నీ చూసే యవది లేదు!"

ఇద్దరం కలిసి పరిగెత్తుతున్నాం — భద్రం ముందూ, నేను వెనకా! మలుపు తిరిగేప్పటికి ఒక ఇంటి ముందు పాడెమీద శవం కనిపించింది. వాకిలి దగ్గిర ఆడవాళ్లు ఏడుస్తున్నారు. వీధిలో మగవాళ్లు ఏడవకుండా నించున్నారు. ఎవరో బ్రాహ్మడు ఏవో మంత్రాలు చదువుతున్నాడు.

నేను సూటిగా బ్రాహ్మడి దగ్గిరకెళ్ళి, "ఈ కేసుకు సబ్బులుగాని, సర్కిలుగాని రిపోర్టు తీసుకోవటం జరిగిందా?" అన్నాను.

బ్రాహ్మడు మంత్రాలు చదవటంమానకుండానే నా కేసి భయంగా చూశాడు. నేను భద్రం చెవిలో, "ఈన చదివేవి మంత్రాలేనా? లేకపోతే ఇంకే దన్నా భాషలో అంతకుడికి డిటెక్టివులొచ్చారని చెబుతున్నాడా?" అని అడిగాను.

"పోయిన మనిషి పేరు?" అని మళ్ళా బ్రాహ్మణ్ణి అడిగాను. ఆయన నాకు సమాధానం చెప్పక, మంత్రాలు చదువుతూనే లేచి వెళ్ళి అవతల నిలబడిఉన్న ఒక నల్లపాంటి, లావుపాంటి మనిషితో ఏదో అన్నాడు. ఆ నలపాటి మనిషిని చూస్తేనే అంతకుడనుకోవచ్చు.

ఆ మనిషి నా దగ్గిరికొచ్చి, "ఎవరు నువ్వు?" అని నన్నడిగాడు.

"డిటెక్టివు నేనా, నువ్వా?" అని ధైర్యంగా అడిగాను.

అందులో ఏం దోసముంది? నే నేమన్నా తప్పుమాటన్నానా? చాచి నన్ను ఆ మనిషి చెంప మీద కొట్టాడుగదా, నేను సీరియస్‌గా డిటెక్టివ్ చేసేస్తే వాడిగతి ఏంకాను?... పోనీ పాపమని వదిలేశాను!

"భద్రం!... పద!" అన్నాను.

"ఎక్కడికి గురో?" అన్నాడు.

"ఇనస్పెక్టరు దగ్గిరికిపోయి ఇక్కడ మనం చూసిందంతా చెప్పేద్దాం. మిగిలినది ఆయనే చూస్తాడు. కావలిస్తే మనసహాయం ఉండనేఉంది!"

ఇద్దరం కలిసి వెళ్ళిపోయేటప్పుడు భద్రం చిన్న గొంతుతో, "దొరక్క దొరికిన కేసు చెయ్యిజారి పోనియొద్దు, గురో!" అన్నాడు.

"మన దగ్గిర ఒక పిస్తోలుగాని, రివాల్వరుగాని లేకపోతే కేసుల్లో పనిచెయ్యటం చాలా కష్టం భద్రం! అయినా పోనివ్వనులే!" అన్నాను.

"ఈలోపల శవాన్ని కాస్తా మాయం చేసేస్తారు, గురో!"

ఆలోచన తట్టకుండా ఏమిటీ ఊదర? భద్రం గాణ్ణి చాచి ఒక్కటి కొట్టాలనిపించింది. డిటెక్షనంటే ఏమిటో తెలీదు, పెట్టదు! ఊరికే లబలబలాడతాడు. డిటెక్టివు కంటపడ్డ శవం డిటెక్టివు పని అయ్యేదాకా ఎక్కడికీ పోదు! ఆ మీమాంసం నా కెప్పుడూ లేదు.

నే నాలోచిస్తున్నది ఏమంటే, కేసుకు కట్టుకోవటంలో ఉంది డిటెక్టివు ప్రతిజ్ఞ. ఒకచోట పట్టి చూశాం. నల్లపాటివాడు అడ్డుపడ్డాడు. అక్కడ వొదిలేసి ఇంకో చోట పట్టుకోవాలి.

# గమనిక

డిటెక్టివ్ కేయాస్ ఆనంద్‌గారి అఖండమైన తెలివితేటలకు అబ్బురపడిపోయి-చాలామంది పాఠకులు ఆనంద్‌గారిని అభినందిస్తూ పత్రికా కార్యాలయానికి ఉత్తరాలు వ్రాశారు. వారందరికీ శ్రీ ఆనంద్ యీ ప్రకటనద్వారా తమ కృతజ్ఞత తెలియచేస్తున్నారు.

ఇంకా కొందరు పాఠకులు ఆనంద్‌గారి చిరునామా కావాలని ఉత్తరాలు వ్రాస్తున్నారు. వారి ఎడ్రసు పరమ రహస్యం. ఆపదలో ఉండి, డిటెక్టివ్ ఆనంద్ సహాయం కావలసినవారు కేరాఫ్ "తెలుగు స్వతంత్ర"కు వ్రాస్తే—ఉత్తరాలు శ్రీ డిటెక్టివ్ గారికి అందజేయ బడతాయి. ప్రజాసేవయే ఆనంద్‌గారి పరమావధి.
—ఇట్లు, అసిస్టెంటు భద్రం వ్రాలు.

కోమటి దుకాణం వాళ్ళు కట్టిన పొట్లాల్లాంటివి కేసులు. చివరట్లే కనిపిస్తుంది. దాన్ని పట్టుకుని విప్పుతాం. కాని దారం ఊడిరాదు. పట్టుకోవాలిసింది ఆ చివర కాదన్నమాట. ఇంకో చివరకోసం వెతగాలి. వెతగ్గా వెతగ్గా చివరదొరికి అప్పుడు దారమంతా వచ్చేస్తుంది. ఈ డిటెక్టివు గాళ్ళకేం తెలుసు? నన్నడిగితే చెబుతా!

ఇప్పుడీ పొట్లం — కాదు, కేసేఉంది. దాన్ని తప్పు చివర పట్టుకున్నాం. బెడిశింది. అసలు చివర ఏదాఅని ఆలోచిస్తున్నా. ఆలోచనతోయ్యకుండా భద్రంగాడు ఒకటే ఊదర...

నల్లపాటివాడిమీద ఇనస్పెక్టరుతో చెప్పటమా? అప్పుడే చెప్పకుండా పనిచేసుకుపోవటమా? వాడే అంతకుడు. సందేహంలేదు. ఆ బ్రాహ్మడు తోడుదొంగ. ఇద్దరూ కలిసి కూడబలుక్కున్నారు. నేను డిటెక్టివునని తెలుసుకున్నారు. అంతవరకు భార్లాగా తెలుస్తూనే ఉంది. పోతే ఇందులో ఇంకెవరన్నా అనుమానితులున్నారా లేదా? ఉంటే వాళ్ళెవరు? లేకపోతే ఎందుకులేరు? ఈ రెండే తేలవల్సిన ప్రశ్నలు. డిటెక్టివు కేయాస్ డ్యూటీ ఆ రెండుప్రశ్నలపైనా ఆధారపడియుంది.

కొంతదూరం వెళ్ళాను. బుర్రతో ఆలోచిస్తున్నానేగాని క్లూలకోసం నాకళ్ళు దారిపొడుగునా వెతుకుతూనే వున్నాయి.

మురికిపేట సందులోకి మళ్ళామో లేదో నా కళ్ళు ఒకపెద్ద క్లూమీద పడ్డాయి.

"భద్రం! క్లూ!" అని ఒక్కకేక పెట్టాను.

"హాత్తెరీ!" అని భద్రం ఒక్క గంతేశాడు. వాడు అటూఇటూ చూసి నా చెవిలో, "ఎక్కడ గురో!" అని అడిగాడు.

నేను వాడి చెవిలో, "ఎవరికీ తెలియకుండా అటుకేసి చూడు. శవం అక్కడి కొచ్చింది!" అన్నాను.

నేనన్నమాట అబద్ధం కానేకాదు. రెండు పూరిగుడిసెల మధ్యగా ఒక బాడిశచెట్టు మొదట్లో గుడ్డకప్పి ఒకశవం పడుకోబెట్టిఉంది. భద్రం దాన్ని చూసి ఏకారణంచేతో "హాత్తెరీ!" అనలేదు.

నేను భద్రం చెవిలో ఇంకేదో చెప్పబోతుండగా ఒక మాసిన గడ్డంవాడు చేతిలో ఒక మూకుడు పట్టుకుని, మావేపువచ్చి, "ఏమన్నా పడెయ్యండి, బాబూ!" అన్నాడు.

మూకుడులో రెండు అర్ధణాలూ, నాలుగు కాన్లూ, ఒకఅణా ఉంది.

"ఏమిటిది?" అని కఠినంగా అన్నాను మాసిన గడ్డంవాడి కళ్ళల్లోకి చూస్తూ.

"సచ్చిపోయింది, బాబూ! దిక్కులేని ముండ" అన్నాడు వాడు.

"ఎవరు చంపారు? నీకొచ్చిన భయంమేం లేదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తా. దాచకుండా నిజం చెప్పెయ్యి!" అన్నా.

"ఎవరు చంపేదేంటి, బాబూ? పేదముండ-రోగిట్టిది. తిండిలేదు, మందులేదు. గొప్పోళ్ళు కాల్చిపారేసిన సిగరెట్లల్లే కాలి బూడిదై సచ్చిం

దయుకోండి!" అన్నాడు వాడు, మాకుట్లో డబ్బులు చప్పుడు చేస్తూ.

"నీ శమత్కారం నాదగ్గిర పనికిరాదు. చచ్చిన తరవాత బూడిద కావలిసిందేగాని, కాలి, బూడిదై ఎవరూ చావరు, నేను డిటెక్టివ్ కేయాస్ అని తెల్సుకో! చెప్పు, దాన్ని ఎవరు చంపారు?"

"పేదోళ్ళ నొకరు సంపాలా! అల్లే సత్తారు!"

వాడు నిజం ఒప్పుకునేట్టు కనపడ్లేదు. భద్రం నా చెవిలో, "గురో! ఆ శవం మగశవం, గురో. ఇది ఆడశవం అంటున్నాడే!" అన్నాడు.

"అదే మిష్టరీ!...ఇంకా జాగర్తగా గమనించావంటే శవం కొద్దిగా సన్నబడ్డట్టూ, కొంచెం పొట్టి అయినట్టూ నీవీసరికి గ్రహించే ఉంటావు. అది మనకో క్లూ."

"ఏం, బాబూ? ఓ శేడ్డబ్బులు దయచేశారంటే దాన్ని యూడిశేత్తాం!" అన్నాడు మాసిన గడ్డంవాడు.

"నీ కెవరన్నా నల్లపాటివాడు తెలుసా?"

"రోశెయ్యేనా, బాబూ?"

"రాసుకో, భద్రం...చెప్పు, రోశెయ్యకూ ఈ హత్యకూ ఏమన్నా సంబంధం ఉందా? అదే మరో విధంగా అడగాలంటే అంతకుట్లో రోశెయ్య కూడా ఉన్నాడా?"

"హత్తేమిటి బాబూ?"

"చాలించు నీ దొంగవేషాలు! నిజం చెప్పక పోయావంటే నేనే నీ తక్షణం ఆ శవాన్ని డిటెక్టివ్ చేసేస్తాను. భద్రం, భూతద్దం అందుకో!" అని కఠినంగా అనేశాను.

"కాత్తుండండి, బాబూ. పేదోళ్ళమీద అంత అగ్గరహమా?" అంటూ మాసినగడ్డంవాడు భద్రానికి ఏదో సమగ్నె చేశాడు. ఇద్దరూ ఎడంగా వెళ్ళి కొంచెంసేపు మాట్లాడుకున్నారు. మాసిన గడ్డంవాడు తల నిలువుగా ఆడించటమూ, భద్రం అడ్డంగా ఆడించటమూ నేను గమనించకపోలేదు.

కొంచెంసేపయాక భద్రం తిరిగి వచ్చి "గురో! వాడు వదిలెయ్యమంటున్నాడు! పోనీండి పాపం!" అన్నాడు.

నా హానందం ఏమని చెప్పను! కేసు విచ్చుకునేప్పుడు ప్రతి డిటెక్టివుకూ యీ హానందం కలిగి తీరుతుందని దెబ్బమీద ఢంకాగొట్టి చెప్పగలను. నాకు హాశ్చర్యం కలిగించిదల్లా ఏమిటంటే, నా అసిస్టెంటయిన భద్రం—నాతోపాటు పుస్తకంలో ఉండవలసిన భద్రం—ఆఖరు క్షణంలో నన్ను కేసు వొదులుకోమంటమా? ఎంత క్రూరం! ఎంత క్రూరం!

"ఆ మాట నీ నోటివెంట ఎట్లా రాగలిగింది భద్రం?" అని అడిగాను హాత్యాశ్చర్యంగా.

"పోనివ్వండి, గురో! బీద ముండాకొడుకు! ఓ పావలా డబ్బు ల్స్తాను, వొదిలెయ్యండని కాళ్లా వేళ్లా పడుతున్నాడు!" అన్నాడు భద్రం.

'ఎంత నాసి డిటెక్టివైనా పావలా లంచం పుచ్చుకుని అంతకణ్ణి వొదిలెయ్యటం నువ్వు ఏ పుస్తకంలోనన్నా చదివావా? ఏమిటి నువ్వనేది? ఈ మాటలనేది భద్రమేనా? నా అసిస్టెంటేనా?"

మళ్ళీ భద్రం నావంక ఆ చూపు చూశాడు. నా కా చూపంటే భలే హాసయ్యం!

"ఏంటి గురోజీ? మనం సంపాయించేదీ పెట్టేదీ లేనేలేదు. కాఫీకన్నా ఉంటుంది, పావలా తీసుకుని పోదాం పదండి!" అన్నాడు వాడు హెగ్గా సిగ్గా లేకుండా.

"ఛీ! అటే మాట్లాడావంటే నిన్ను కూడా అనుమానితుల్లో చేర్చి పారేస్తాను. ఆ టేపిట్లాతే" అంటూ వాడి జేబులో చెయ్యిపెట్టి టేపు తీసుకుని శవంకేసి వెళ్ళాను. నేను శవానికి ఒక అడుగు దూరంలో ఉండగా మాసినగడ్డంవాడు "రోశా!" అని ఒక్క కేక పెట్టాడు.

ఆ క్షణంలో జరిగింది అసలు మిష్టరీ!

శవం కాస్తా నా కళ్లెదటే, నేను చూస్తుండగానే లేచి, కప్పిన గుడ్డ తోసిపారేసి పరిగెత్త నారంభించింది! మిష్టరీలో ఇంకో మిష్టరీ ఏమంటే ఆ పరిగెత్తిపోయిన శవం అడశవం కానేకాదు, మగశవం!

"భద్రం, మిష్టరీ!" అన్నాను.

"మిష్టరీ కాదు, నా కార్థం! నిష్కారణంగా పావలా డబ్బులు పోగొట్టాం!" అన్నాడు భద్రం నీరసంగా.

నేను ఆలోచిస్తున్నాను! దీర్ఘంగా ఆలోచిస్తున్నాను. శవం ఎట్లా పారిపోయింది? నాకు తెలీదు! ఎవరికీ తెలీదు!

★